





నేడు ముగ్గురు మంత్రుల పర్యటన

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌కు శంకుస్థాపన

ఖమ్మం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తేబోతున్న ఇంటిగ్రేటెడ్ విద్యావిధానంలో భాగంగా జిల్లాలో మూడు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌కు శుక్రవారం శంకుస్థాపన జరగనుంది. ఒక్కో విద్యాలయానికి రూ.100 కోట్ల చొప్పున ముగ్గురు మంత్రుల నియోజకవర్గాల్లో రూ.300 కోట్లతో ఈ విద్యాలయాలు నిర్మాణం కాబోతున్నాయి. హైస్కూల్‌తో పాటు ఇంటర్ విద్యాబోధనతో అన్ని కులాల విద్యార్థులకు ఒకే చోట ఒకే తరహా విద్యాబోధన అందనుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంగ్లీష్ మీడియంలో సాగే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌కు మధిర నియోజకవర్గంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బోనకల్ మండలం లక్ష్మీపురంలో ఉదయం 11 గంటలకు శంకుస్థాపన చేయనున్నారు. రఘునాథపాలెం మండలం జింకలతండాలో మధ్యాహ్నం 2-30గంటలకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పాలేరు నియోజకవర్గంలో ఖమ్మంరూరల్ మండలం పొన్నేకల్‌లో ఉదయం 9-30 గంటలకు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసింది.







పెరికసింగారంలో సద్దుల బతుకమ్మ వేడుకల్లో మంత్రి పొంగులేటి



ఖమ్మం మున్నేటి తీరంలో...



కూసుమంచి మండలం పెరికసింగారంలోని 51 అడుగుల బతుకమ్మ

తీరొక్క పూల తుళ్లింత...

- కన్నులపండువగా సద్దుల బతుకమ్మ
- పెరికసింగారంలో ఆకట్టుకున్న 51 అడుగుల బతుకమ్మ

ఖమ్మం సాంస్కృతికం/కూసుమంచి/కొత్తగూడెం సాంస్కృతికం, అక్టోబరు 10: 'పోయిరా బతుకమ్మ.. పోయి రావమ్మా, వచ్చే ఏడాది మళ్లీ రావమ్మా' అంటూ మహిళలు సద్దుల బతుకమ్మను సాగనంపారు.. పసుపు ముద్దలతో గౌరమ్మను తయారు చేసి ఘనంగా పూజలు చేశారు. తొమ్మిది రోజుల పాటు మహిళల పూజలందుకున్న బతుకమ్మ నిమజ్జన కార్యక్రమం గురువారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగింది.. ఖమ్మంలోని మున్నేటి తీరం, కొత్తగూడెంలోని ముర్రేడు ఘాట్, గోదుమవాగు, రుద్రంపూర్‌లోని దన్‌బాద్‌చెరువుల వద్ద మహిళల కోలాహలం ఏర్పడింది.. ఎంగిలి పూల బతుకమ్మ నుంచి బతుకమ్మ వేడుకకు శ్రీకారం చుట్టిన మహిళలు.. తొమ్మిదోరోజున సద్దుల బతుకమ్మతో సాగనంపటం ఆనవాయితీగా వస్తున్న విషయమే. చెరువులు, సాగర్ కాలువలు, ఏర్లు తదితర చోట్ల బతుకమ్మలను నీట విడిచిన భక్తులు.. ఖమ్మంలోని మున్నేటిలో సద్దుల బతుకమ్మను కన్నులపండువగా జరుపుకున్నారు.



సాయంత్రం నుంచి రాత్రి పది గంటల వరకు జాతరను తలపించే విధంగా ఉత్సవం జరిగింది. తెలంగాణ ఆటాపాట, కట్టు బొట్టు తెలిపే విధంగా బతుకమ్మ నిమజ్జనం నిర్వహించారు. బతుకమ్మలను తంగేడు పూలతో అలంకరించి చేతుల్లో పట్టుకొని కొందరు, రిక్షాలు, ఆటోలు తదితర వాహనాలపై మరికొందరు తరలివచ్చారు. బతుకమ్మలను తీసుకొచ్చిన మహిళలు సాంస్కృతిక సందడి చేశారు. నగరవ్యాప్తంగా ఎంతోమంది తరలిరావటంతో మున్నేటి తీరం జనసంద్రంగా మారింది. అలాగే వైరా, తల్లాడ, సత్తుపల్లి, పాలేరు, మధిర తదితర ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు.

51 అడుగుల భారీ బతుకమ్మ

సద్దుల బతుకమ్మ సందర్భంగా కూసుమంచి మండలం పెరికసింగారంలో 51 అడుగుల భారీ బతుకమ్మను పేర్చారు. గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ జూకూరి గోపాలరావు-విజయలక్ష్మి (మిగతా 8వ పేజీలో)



ఖమ్మంలో బతుకమ్మతో యువతి





'ఆయిల్ ఫెడ్' సొంత విద్యుత్

- అశ్వారావుపేట పామాయిల్ కర్మాగారంలో విద్యుత్‌ప్లాంట్ నిర్మాణం
- 2.5 మెగావాట్ల సామర్థ్యం... రూ. 36 కోట్ల ఖర్చు...
- పామాయిల్ వ్యర్థాలతో కరెంటు తయారీ
- రాష్ట్రంలో రెండో సొంత ప్లాంట్
- రేపు ప్రారంభించనున్న మంత్రి తుమ్మల

9

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

- రైతులకు ఇప్పటివరకు రూ.18 వేల కోట్ల రుణమాఫీ చేశాం
- సంక్రాంతికి మద్దులపల్లి మార్కెట్ ప్రారంభిస్తాం : తుమ్మల, పొంగులేటి



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఖమ్మం రూరల్, అక్టోబరు 10: సంక్రాంతి పండుగకు మద్దులపల్లి మార్కెట్‌ను ప్రారంభించి రైతులకు అందుబాటులోకి తీసుకువస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. పాలేరు నియోజకవర్గంలోని రూరల్ మండలం మద్దులపల్లి మోడల్ మార్కెట్ పాలకవర్గం ప్రమాణస్వీకారం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన మంత్రులు తుమ్మల, పొంగులేటి మాట్లాడుతూ ఈ పాలకవర్గం కాలంలోనే మార్కెట్‌ను అభివృద్ధిచేసి, గోదాములు, కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేసి జిల్లాలోనే ఎక్కువమంది రైతులు ఈ మార్కెట్‌కు వచ్చేలా తీర్చిదిద్దుతామన్నారు. పాలేరు చుట్టూ జల్లెడలా జాతీయ రహదారులు అల్లుకుని ఉన్నాయన్నారు. కరువు పీడిత పాలేరును పాడిపంటలతో తులతూగేలా చేశామన్నారు. రైతుల కోసం బడ్జెట్‌లో రూ.50వేల కోట్లు కేటాయించామన్నారు. రూ.18 వేల కోట్లు (మిగతా 8వ పేజీలో)



కిడ్నాప్ ముఠా

ఆటకట్టు

- గంధసిరిలో గత నెల 25న వ్యక్తి కిడ్నాప్
- పాత కక్షలతో చేయించిన మరో వ్యక్తి
- 8 మందిని అరెస్టు చేసిన పోలీసులు

9

మధ్యాహ్న బిర్యానీ భోజనం

- సత్తుపల్లి ఎంపీపీఎస్‌లో హెచ్‌ఎం నిర్వాకం
- 'మిడ్ డే మీల్స్' వర్కర్స్‌తో పాఠశాల ఆవరణలో వంటకం
- షోకాజ్ నోటీసు జారీ

9



గంగను చేరిన గౌరమ్మ



గుండాలలో బతుకమ్మ సంబురాలు



ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో గురువారం సద్దుల బతుకమ్మ వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి తంగేడు, గునుగు సహిత తీరొక్క పూలను సేకరించిన మహిళలు బతుకమ్మలను అందంగా పేర్చారు. భక్తితో చేసిన పసుపు గౌరమ్మను, గుమ్మడి పువ్వు గౌరమ్మను బతుకమ్మ శిరస్సు భాగంతో నిలిపారు. జ్యోతిని వెలిగించి పలహారాలతో సహా ఒక్క చోటకు బతుకమ్మలను చేర్చారు. ఎంపలి చెట్టు పేర్చిన బతుకమ్మల చుట్టూ పాటలు పాడుతూ మహిళలు సంప్రదాయ బద్ధంగా కోలాటం వేశారు. అనంతరం గౌరమ్మను జలకాలాడించి బతుకమ్మలను నీటిలో నిమజ్జనం చేశారు. తదుపరి పసుపు కుంకుమలు, వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు.





ఖమ్మం నగరంలో ...



గౌరమ్మ పాట పాడుతున్న మహిళలు



వాయినాలు ఇచ్చుకుంటూ...



ఉత్సాహంగా దస్తీ.. విస్తీ...



ఖమ్మం మున్నేరుకు తరలివస్తున్న బతుకమ్మలు



ఇల్లెందులో పూలపండుగ

ముదిమిలో వెతలెన్నో..

- కన్నవారే భారమవుతున్నారు
- వృద్ధాశ్రమాల్లో పెద్దలను వదిలేస్తున్న సంతానం
- అంత్యక్రియలకు హాజరుకాని కొడుకులు
- అన్నీ తామే అవుతున్న ఆశ్రమాలు
- బంధాలు, అనుబంధాలకు దూరమవుతున్న నేటితరం

భద్రాచలం, అక్టోబరు 10: తల్లిదండ్రులను దైవంగా భావించి సమున్నతమైన రీతిలో సంభావించే సంస్కృతి మనది. ఇతర దేశాల్లో లాగ తల్లిని తలుచుకుంటూ ఒక రోజు, తండ్రిని తలుచుకుంటూ మరొక రోజు లాంటి పండ గలుండవు. ప్రతి రోజు కూడా వారిని నమస్కరించడం వారితో సమయాన్ని వెచ్చించడం అనాదిగా మన కుటుంబ వ్యవస్థలో వస్తున్న ఆదర్శమైన స్థితి. నాడు ఈ కుటుంబంలో ప్రధానమైనటువంటి వీరితో పాటు పెద్దలను గౌరవించడం వారి మాటను తూచ తప్పకుండా పాటించడం పరిపాటి. రాను రాను ఆ స్థితి కుంటుపడింది. బంధాలకు అనుబంధాలకు అర్థం మారిపోయింది. తల్లిదండ్రులను విస్మరించడం చివరికి వారిని పోషించే బాధ్యతను కూడా విస్మరించడం అనాథలుగా వారిని వృద్ధాశ్రమంలో చేర్పించడం మనకు కనిపిస్తున్న అత్యంత దయనీయమైన స్థితి. బంధాలకు, అనుబంధాలకు తూట్లు పొడిచి నవీన సంస్కృతి వెర్రితలలు వేస్తున్న విషమపరిస్థితి.

కన్నవారే భారమా?

నవమాసాలు మోసి కనిపెంచి వారికి సమాజంలో మంచి స్థానం దక్కేలా చూసిన కన్నవారే వారి సంతానానికి భారమవుతున్నారా అనే ప్రశ్న తలెత్తుతోంది. ఎందుకంటే గతంలో అక్కడక్కడ మాత్రమే దర్శనమిచ్చే వృద్ధాశ్రమాలు పదుల సంఖ్యకు చేరడం అత్యంత బాధకరం. ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజల్లుతున్న భద్రాచలంలోని మానవసేవ వాలంటరీ ఆర్గనైజేషన్ అనాథల, వృద్ధులల, దివ్యాంగుల ఆశ్రమంలో ప్రస్తుతం 126 మంది వృద్ధులు ఆశ్రయం పొందుతున్నారు. ఇందులో పదుల సంఖ్యలో ఉన్న వృద్ధులకు ఆర్థికంగా ఎటువంటి ఇబ్బంది లేకపోయినా ఏ మాత్రం కనికరం లేకుండా వారి కుటుంబ సభ్యులు ఆశ్రమానికి పంపినట్లు సమాచారం.

500 మంది అనాథలకు దహన సంస్కారాలు

వృద్ధాశ్రమంలో గత దశాబ్దంన్నర కాలంలో 500 మంది అనాథలకు నిర్వాహకులే దహన సంస్కారాలు నిర్వహించారు. రక్తసంబంధీకులు ఉన్నా ఇందులో చాలా మందికి కనీసం వారు మృతి చెందిన అనంతరం కూడా వారికి అంత్యక్రియలు నిర్వహించేందుకు రాకపోవడంతో వృద్ధాశ్రమం నిర్వాహకులే అంత్యక్రియలు నిర్వహించారు. ఇందులో ఇంకా బాధకరమైన విషయం ఏమిటంటే వృద్ధాశ్రమంలో ఉన్న వారు చనిపోయినప్పుడు వారి రక్తసంబంధీకులకు సమాచారం ఇచ్చినా చివరి మజిలీ కార్యక్రమాలకు మేము డబ్బులు పంపుతాం, కార్యక్రమాలు చేయండి అని చెప్పి చివరకు ఆ కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఆ డబ్బులు సైతం పంపకపోగా ఫోను చేస్తే కనీసం స్పందించని పరిస్థితులున్నట్లు సమాచారం.

ఆ కుటుంబం వారికి అండగా..

అనాథలు, వృద్ధులు, దివ్యాంగులు.. ఇలా ఆపదలో ఉన్న వారిని అక్కున చేర్చుకొని ఆ ఓ కుటుంబం వారికి అండగా నిలుస్తోంది. హంస్సేన్, ఆయన సతీమణి సరోజ, వారి కుమారుడు రఫీ, కోడలు విజయలక్ష్మి వృద్ధాశ్రమంలో సేవలందిస్తుంటారు. గత 15 ఏళ్లు నుంచి ఈ కుటుంబం తమ వంతుగా వీరి సేవలో నిమగ్నమవుతుండటం విశేషం. ఆశ్రమంలో ఉండే వారికి వేసవి కాలంలో ఉక్కపోత నుంచి ఉశమనం కోసం కూలర్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందిస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగులకు అనుకూలంగా ఉండేలా మరుగుదొడ్లను సైతం నిర్మించారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం తరుచూ అవసరాల రీత్యా భద్రాచలంలోని ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఎస్ ఎల్ కాంతారావు వైద్యసేవలు అందిస్తున్నారు. ఇదే సమయంలో ప్రవాస భారతీయులు, పలు సంస్థలు, ప్రముఖులు తమ వంతు ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నారు.



భద్రాచలంలోని ఓ వృద్ధాశ్రమం



ఆశ్రయం పొందుతున్న వృద్ధులు

బాధితులకు పరిహారం పంపిణీలో మంత్రుల విఫలం

- 16న తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా
- రౌండ్ టేబుల్ సమావేశంలో విపక్ష నేతలు

ఖమ్మంటౌన్, అక్టోబరు 10: మున్నేరు వరద బాధితులకు నష్టపరిహారం అందించటంలో జిల్లాకు చెందిన మంత్రులు విఫలమయ్యారని విపక్షనేతలు విమర్శించారు. వరద బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని, చాలామందికి బ్యాంక్‌ల్లో సొమ్ము జమకాలేదని, వారికి వెంటనే జమ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం త్రీటౌన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఒక ఫంక్షన్‌హాల్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, బీఆర్ఎస్ జిల్లా నాయకులు గుండాల కృష్ణ, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినపల్లి వేంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా నాయకులు నూనె శశిధర్ మాట్లాడుతూ శంఖుస్థాపనలకు ఇచ్చే ప్రాముఖ్యత వరదల్లో నష్టపోయిన బాధితులకు పరిహారం ఇప్పించటంలో చూపించటం లేదన్నారు. జిల్లా ప్రజలు కాంగ్రెస్‌పై ఎంతో నమ్మకంతో గెలిపిస్తే మంత్రులు, నాయకులు వారిని పట్టించుకోవటం లేదన్నారు.వరద నష్టపరిహారం రూ.16,500లకు పరిమితం చేసి, కొంతమందికే బ్యాంకుల్లో జమచేశారని విమర్శించారు. నష్టపరిహారం జమకానివారు కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. వరద బాధితులకు నష్టపరిహారం పెంచాలని, ప్రకటించిన పరిహారం అందరికీ అందించాలనే డిమాండ్‌తో ఈనెల 16న తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో సీపీఎం జిల్లా నాయకులు వై.విక్రమ్, యర్రా శ్రీనివాసరావు, భూక్యా వీరభద్రం, వజినేపల్లి శ్రీనివాసరావు, నవీన్‌రెడ్డి, సుదర్శన్, మహిళా సంఘం నేతలు అమీనా, రాజు,మాస్‌లైన్ నేతలు ఝాన్సీ, సీపీఐ నాయకులు వీరభద్రం, కార్పొరేటర్ యల్లంపల్లి హనుమంతరావు, బీఆర్ఎస్ నాయకులు కన్నం ప్రసన్న కృష్ణ, మాటేటి నాగేశ్వరరావు, ఉపేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

రేపు భద్రాచలంలో దసరా వేడుకలు

- శ్రీరామ మహా పట్టాభిషేకం
- శ్రీరామలీలా మహోత్సవంకు ఏర్పాట్లు

భద్రాచలం, అక్టోబరు 10: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శనివారం విజయదశమి వేడుకలు నిర్వహించనున్నారు. స్థానిక దసరా మండపంలో శ్రీరామలీలా మహోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాక్షసులపై దైవశక్తులు పోరాడి విజయం సాధించిన రోజే విజయదశమిగా పురాణ గాథలు పేర్కొంటున్నాయి. శ్రీరామ చంద్రుడు విజయదశమినాడే యుద్ధమునకు బయలుదేరి విజయం సాధించాడని, శ్రీరాముడు నవరా త్రి ఉత్సవాలను ఆచరించారని దాని ఫలితంగానే రావణాసురుడిని సంహరించారని కాళికాపురాణం తదితర శక్తి సంబంధిత గ్రంథాలు తెలియజేస్తున్నాయి. అందుచేతే ఉత్తరాదిలో రామ్‌లీలా మహోత్సవం రావణాసుర ప్రతిమను దహనం చేస్తారు.

అర్జునుడు ఉత్తర గోగ్రహణ సమయంలో కౌరవులపై ఆరోజునే విజయం సాధించాడని పురాణాలు పేర్కొంటున్నాయి. ఇదే రీతిలో అమ్మవారు మహిషాశురుడిని సంహరించి విజయం సాధించింది కూడా విజయదశమినాడే. దీంతో విజయదశమి నాడు ఆయుధ పూజను క్షత్రియులు, పుస్తక పూజను విజ్ఞాన కాముకులు ఈ విజయదశమిరోజే నిర్వహిస్తారు. అనాధిగా విజయయాత్రను విజయదశమినాడే ప్రారంభించడం సంప్రదాయంగా వస్తోంది.



శమీపూజ నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

రామ విజయానికి చిహ్నం

విజయదశమిని దసరా అని కూడా పిలుస్తారు. దశకంఠుడైన రావణునిపై శ్రీరాముడు విజయాన్ని సాధించినందుకు చిహ్నంగా ఈ పండుగకు దశకంఠహర అని పిలిచేవారు. కాలక్రమేణా దసరాగా ప్రచారంలోకి వచ్చింది. దీంతో శ్రీరాముడు రావణుని చంపే విధానాన్ని గుర్తుచేస్తూ ఉత్తర హిందూ దేశంలో శ్రీరామలీలా ఉత్సవాన్ని విజయదశమినాడే నిర్వహిస్తారు. ఇదే రీతిలో దక్షిణ అయోధ్యగా బాసిల్లుతున్న భద్రాచలం దివ్యక్షేత్రంలో అష్ట లక్ష్మి పూజలను, శ్రీరామాయణ పారాయణోత్సవాన్ని జరిపి విజయదశమినాడు శ్రీరామచంద్ర మహాప్రభువుకు పట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహిస్తారు. ఆ తర్వాత సంధ్యావేళా సమయంలో విజయ యా త్ర,శమీ పూజ, ఆయుధ పూజ జరిపి శ్రీరామలీలా ఉత్సవాన్ని జరుపుతారు. శరత్‌రుతువు ఆరంభంలో జరిపే ఈ ఉత్సవాలు సర్వ దేవతలకు ప్రీతికరమైనవే. ఈ కాలంలో అమ్మవారిని శ్రీరామచంద్రున్ని పూజించుట సర్వశ్రేష్ఠం. స్వామి వారికి సమర్పించిన శమీ ప త్రాలను శిరస్సున ధరిస్తారో వారికి విజయాలు దక్కుతాయని పాంచరా త్రాగమంలో పేర్కొనబడింది.

రామాలయంలో విజయదశమి వేడుకలు

భద్రాద్రిలోని శ్రీసీతారామ చంద్ర స్వామిదేవస్థానంలో శనివారం విజయదశమి వేడుకలను నిర్వహించనున్నారు. అమ్మవారు మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనుండగా ఉదయం 11.30 గం.లకు శ్రీరామాయణ పారాయణ సమాప్తిని పురస్కరించుకొని శ్రీరామ మహాపట్టాభిషేకం నిర్వహించనున్నారు. అలాగే భక్తరామదాస నిర్మితమైన దసరా మండపంలో విజయోత్సవం (శమీపూజ), శ్రీరామలీలా మహోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకోసం దేవస్థానం అధికారులు ఏర్పాట్లను చేపడుతున్నారు.

తల్లీ మమ్ము ఆశీర్వదించు...

- ఐశ్వర్య లక్ష్మి అలంకారాన్ని దర్శించి పులకించిన భక్తులు

భద్రాచలం, అక్టోబరు 10: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్ననవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు గురువారం ఐశ్వర్యలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రామాలయ ప్రాంగణంలో గల శ్రీ లక్ష్మితాయారు అమ్మవారు ఐశ్వర్యలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వడంతో ఒక్కసారిగా భక్తులు దర్శించి పులకించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలకు ఐశ్వర్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. ఇదిలా ఉండా నేడు అమ్మవారు వీరలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్ననవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు గురువారం ఐశ్వర్యలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రామాలయ ప్రాంగణంలో గల శ్రీ లక్ష్మితాయారు అమ్మవారు ఐశ్వర్యలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వడంతో ఒక్కసారిగా భక్తులు దర్శించి పులకించారు. ఈ సందర్భంగా అమ్మవారికి



ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలకు ఐశ్వర్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. ఇదిలా ఉండా నేడు అమ్మవారు వీరలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

తీరొక్క పూల తుళ్లింత

(7వ పేజీ తరువాయి)

దంపతుల ఆధ్వర్యంలో ఈ అతిపెద్ద బతుకమ్మను పేర్చారు. గతేడాది 33 అడుగుల బతుకమ్మను పేర్చారు. ప్రతిఏటా పెరికసింగారం గ్రామంలో భారీ బతుకమ్మలు పేరుస్తూ ఘనంగా వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. కాగా ఈ ఏడాది పేర్చిన బతుకమ్మ రాష్ట్రంలోనే పెద్దది కావచ్చని గ్రామస్థులు భావిస్తున్నారు. భారీ బతుకమ్మను పేర్చేందుకు సుమారు ఏడుక్వింటాళ్ల బంతి, టేకు, తంగేడు, గునుగు పూలను వినియోగించినట్లు గోపాలరావు దంపతులు తెలిపారు. సుమారు 25మంది పదిగంటల పాటు శ్రమించి పేర్చారు. బతుకమ్మ చివరలో దుర్గామాత ప్రతిమను ఏర్పాటు చేశారు. తెలంగాణలో బతుకమ్మ విశిష్టతను చాటిచెప్పేలా ప్రతి సంవత్సరం భారీ బతుకమ్మలను పేర్చుతున్నట్లు గోపాలరావు సతీమణి విజయలక్ష్మి తెలిపారు.

సంబురాల్లో పాల్గొన్న మంత్రి పొంగులేటి

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ పండుగ అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పెరికసింగారం గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 51 అడుగుల భారీ బతుకమ్మను పేర్చిన జూకూరి గోపాలరావు దంపతులను పొంగులేటి అభినందించారు. ఈ సందర్భంగా మహిళలకు ముందస్తుగా దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జి దయాకర్‌రెడ్డి, స్వర్ణకుమారి, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కొత్తగూడెంలో..

సద్దుల బతుకమ్మ సంబురాలు భద్రాద్రికొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో అంబరాన్నంటాయి. తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయలను ఉట్టిపడేలా పట్టు వస్త్రాలను ధరించిన మహిళలు బతుకమ్మల చుట్టూ తిరుగుతూ లయబద్ధంగా చప్పట్లతో బతుకమ్మ పాటలను పాడారు. ఇళ్లకూడళ్ల వద్ద బతుకమ్మ సంబరాలు జరుపుకొని అనంతరం బతుకమ్మలను ఎత్తుకుని వెళ్లి సమీపంలోని నిమ్మజ్జన ఘాట్లవద్ద కాసేపు బతుకమ్మ ఆడిపాడి చెరువులు, కుంటలు, వాగుల్లో బతుక్మలను నిమజ్జనం చేశారు.

కొత్తగూడెంలోని ముర్రేడు ఘాటు, గోదుమవాగు, రుద్రంపూర్‌లోని ధన్‌బాద్‌చెరువులతో పాటు సుజాతనగర్ లోని చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేసి, మహిళలు తమ వెంట తెచ్చుకున్న సత్తుపిండి వంటలను వాయినంగా సమర్పించుకుని ఆత్మీయతను చాటుకున్నారు. ఎటువంటి అపశ్రుతులు జరగకుండా పోలీసు యంత్రాంగం గట్టి బందోబస్తు చర్యలు తీసుకున్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

(7వ పేజీ తరువాయి)

రైతు రుణమాఫీ చేశామన్నారు. ఇంకో రూ.13వేల కోట్ల రైతు రుణాలు మాఫీ చేయాల్సి ఉందన్నారు. అవి కూడా త్వరలోనే చేస్తామన్నారు.

రాష్ట్రంలో ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా భావించి తెలంగాణకు ముందుకు తీసుకువెళ్తున్నామన్నారు. కృష్ణా జలాలు రాకపోయినా గోదావరి నీళ్లతో పాలేరు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. రైతులకు సంబంధించి పంటలు నష్టపోతే ప్రభుత్వమే రైతుల తరుపున పంటలకు ఇన్సూరెన్సు కట్టి పంటల నష్టపరిహారం అందజేస్తామన్నారు. ఆయిల్ పామ్ సాగులో అన్ని రాష్ట్రాల కంటే తెలంగాణ ముందుకు పోవాలని ఆకాంక్షించారు.

ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తామని తెలిపారు. రాష్ట్రంలో మొదటి విడతలోనే 31 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు శంకుస్థాపన చేయబోతున్నామన్నారు. రాబోయే కొద్దిరోజుల్లో నియోజకవర్గానికి 3500 ఇళ్లు ఇవ్వబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, జిల్లా నాయకులు సాధు రమేష్‌రెడ్డి, మద్దినేని స్వర్ణకుమారి, మార్కెట్ చైర్మన్ భైరు హరినాథ బాబు, బండి జగదీష్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

దేవస్థానం ఈవో ఆదేశాల బేఖాతరు

- ఇరువురు కీలక వైదిక సిబ్బంది ఉత్సవాలకు గైర్హాజరు

భ ద్రాచలం, అక్టోబరు10: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శరన్నవరా త్రోత్సవ ప్రయుక్త విజయదశమి కార్య క్రమాలు, శ్రీరామాయణ పారాయణ మహోత్సవాలు సంప్రదాయబద్ధంగా సాగుతున్న క్రమంలో ఇరువురు కీలక వైదిక సిబ్బంది దేవస్థానం ఈవో ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ విధులకు గైర్హాజరు అవ్వటం దేవస్థానం వర్గాలలో, భక్తులలో చర్చనీయాంశంగా మారింది. ఈ నెల 3వ తేదీ నుంచి రామాయణ పారాయణ మహోత్సవాలు ప్రారంభం కాగా అందులో పాల్గొంటున్న దేవస్థానంలో వైదిక విభాగంలో అత్యంత కీలక బాధ్యతలు నిర్వహించే ఒకరు మూడు రోజుల క్రితం అధికారుల అనుమతి లేకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లినట్లు సమాచారం. మరొక కీలక వైదిక సిబ్బంది ఒకరు సైతం ఇదే రీతిలో వెళ్లినట్లు ప్రచారం సాగుతోంది. భద్రాద్రిలో నవరా త్రి మహోత్సవాలు, దాతల సమావేశం నిర్వహిస్తున్న క్రమంలో ఎటువంటి సెలవులు ఉండవని సిబ్బంది అందరూ పూర్తిగా అందుబాటులో ఉండాలని దేవస్థానం ఈవో ఉత్తర్వులు జారీ చేశారు. అయినా వారు సెలవుచీటీలు పెట్టి అనుమతులు రాకుండానే వెళ్లటం దేవస్థానం వర్గాలు, భక్తులలో తీవ్ర చర్చకు దారితీస్తోంది. అయితే క్రమబద్ధంగా శ్రీరామాయణ పారాయణం చేస్తున్న ఒకరు అర్థాంతరంగా పారాయణాన్ని విడిచిపెట్టి వెళ్లటం పట్ల సర్వత్రా ఆక్షేపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే శరన్నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా తొలి అలంకారం ఆదిలక్ష్మి అలంకారాన్ని నాలుగున నిర్వహించటం సర్వ త్రా చర్చకు దారి తీసింది. ఈ విషయంపై తీ వ్ర విమర్శలు సైతం వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలో దేవస్థానం వైదిక సిబ్బంది కొందరు ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. ఇదిలా ఉండగా దేవస్థానం వైదిక సిబ్బంది ఇరువురు విధులకు గైర్హాజరు అయ్యి ఇతర ప్రాంతాలకు వెళ్లి ప్రవచనాలు చెప్పటంపై సామాజిక మాధ్యమాల్లో ప్రచారం సాగుతోంది.దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు తరువాత అత్యంత ప్రాధాన్యం ఉన్న శరన్నవ రా త్రి ఉత్సవాల సమయంలో వైదిక సిబ్బంది ఈ విధంగా అర్థాంతరంగా వెళ్లటం ఎంత వరకు సమంజసమనే వ్యాఖ్యలు భక్తుల నుంచి వినిపిస్తున్నాయి.

అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో పవర్‌ప్లాంట్

- రేపు మంత్రి తుమ్మల చేతుల మీదుగా ప్రారంభం
- శాస్త్రవేత్తలతో రైతులకు ముఖాముఖి కార్యక్రమం
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ జితేష్, ఎమ్మెల్యే ఆదినారాయణ



మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు ఆహ్వాన పత్రం అందజేస్తున్న ఆయిల్‌పామ్ రైతులు

అశ్వారావుపేట, అక్టోబరు10: భద్రాద్రి జిల్లా అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీ ఆవరణలో నిర్మించిన పవర్ ప్లాంట్‌ను శనివారం దసరా రోజున వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభిస్తారని కలెక్టర్ జితేష్ వీ పాటిల్, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. ప్రారంభానికి సిద్ధమైన పవర్ ప్లాంట్‌ను గురువారం కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. రైతులకు దసరా రోజున శుభవార్త చెప్పాలనే ఉద్దేశ్యంతో ప్లాంట్ ప్రారంభ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు భోజనాలు, శాస్త్రవేత్తలతో అవగాహన సదస్సు ఉంటుందని చెప్పారు. రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పవర్ ప్లాంట్ ప్రారంభోత్సవ ఏర్పాట్లపై కలెక్టర్, ఎమ్మెల్యే ఆయిల్‌ఫెడ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, ఆయిల్‌పామ్ రైతుసంఘ నేతలతో సమీక్షించారు. ఎటువంటి లోటుపాట్లకు అవకాశం ఇవ్వకుండా ప్రణాళిక ప్రకారం పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ డివిజన్ మేనేజర్ ఆకుల బాలకృష్ణ, ఫ్యాక్టరీ మేనేజర్ నాగబాబు, సీనియర్ మేనేజర్ శ్రీకాంత్, ఆయిల్‌పామ్ రైతులు ఆలపాటి రామచంద్ర ప్రసాద్, బండి భాస్కర్, మొగళ్లపు చెన్నకేశవరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలకు ఆహ్వానం

ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి అనుబంధంగా నిర్మించిన పవర్‌ప్లాంట్ ప్రారంభోత్సవానికి, రైతులతో శాస్త్రవేత్తలతో సమావేశానికి ముఖ్య అతిథులుగా రావాలని వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు, ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు ఆయిల్‌పామ్ రైతు సంఘ నాయకులు ఆహ్వాన పత్రికను అందజేశా రు. టీఎస్ ఆయిల్‌పామ్ అడ్వయిజరీ కమిటీ సభ్యులు ఆలపాటి రామచంద్ర ప్రసాద్, కేవీ సత్యనారాయణ, మొగళ్లపు చెన్నకేశవరావు, కొయ్యల అచుతరావు, పాషా, ఆయిల్‌ఫెడ్ అధికారులు బాలకృష్ణ, శ్రీకాంత్, నాగబాబు ఉన్నారు.

కేసీఆర్ హయాంలోనే శంకుస్థాపన

కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే అశ్వారావుపేట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలో పవర్ ప్లాంట్ పనులకు శంకుస్థాపన జరిగిందని మాజీ ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన పవర్ ప్లాంట్‌ను పరిశీలించి, ఆయిల్‌ఫెడ్ అధికారులతో మాట్లాడారు. అశ్వారావుపేట అంటే కేసీఆర్‌కు ఎంతో ఇష్టమని, అడిగినవన్నీ తక్షణమే ఇచ్చారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం హయాంలో రూ.35 కోట్లతో పవర్ ప్లాంట్ మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి, వెంకన్నబాబు, సత్యవరపు సంపూర్ణ, తాళం సూరిబాబు, మోహన్, దాయా యుగంధర్, అబ్దుల్ జిన్నా, భూక్యా రాజు తదితరులు పాల్గొన్నారు.



పామాయిల్ ఫ్యాక్టరీలోని పవర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వీ పాటిల్

మంత్రి తుమ్మల కృషితోనే పామాయిల్‌కు మహర్దశ

- రేపు అశ్వరావుపేటలో జాతీయ సదస్సు
- పామాయిల్ రైతులు, కిసాన్ కాంగ్రెస్ నాయకులు



మాట్లాడుతున్న రఘునాథపాలెం సొసైటీ అధ్యక్షుడు తాతా రఘురాం

రఘునాథపాలెం, అక్టోబరు 10: వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితోనే పామాయిల్ గెలల ధరలు పెరిగి రైతులకు మద్దతు ధరలు అందుబాటులోకి వచ్చాయని పామాయిల్ రైతులు, సొసైటీ అధ్యక్షులు, కిసాన్ కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రఘునాథపాలెంలో సొసైటీ అధ్యక్షుడు తాతా రఘురాం అధ్యక్షతన విలేకర్ల సమావేశం గురువారం నిర్వహించారు. విదేశాల నుంచి పామాయిల్ దేశంలోకి దిగుమతి తగ్గించేందుకు దిగుమతి సుంకాన్ని 5.5శాతం నుంచి 25.5శాతంకు పెంచారని, దీంతో స్వదేశంలోని పామాయిల్ గెలలకు ధరలు పెరిగాయని వివరించారు. గతంలో టన్ను పామాయిల్ గెలలు రూ. 14,390 ఉండగా ఇప్పుడు రూ.19,043 వరకు పెరిగిందన్నారు. పామాయిల్ రైతులకు ఒక్క టన్నుకు రూ. 2,651 మద్దతు ధర పెరిగిందని ఆశాభావం వ్యక్తం చేశారు. కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కొంటెముక్కల నాగేశ్వరరావు మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సొంతంగా పామాయిల్ సాగు చేయటం ద్వారా రైతుల బాధలను తెలుసుకొని ఇంతటి చొరవ తీసుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. తక్కువ పెట్టుబడి ఎక్కువ ఆదాయ రాబడి ఉండే పామాయిల్ సాగు చేయాలని కోరారు. మంత్రి తుమ్మల చొరవతోనే శనివారం అశ్వారావుపేటలో పామాయిల్ జాతీయ సదస్సును ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ నాయకులు వాంకుడోత్ విజయదీపక్‌నాయక్, బాతుల రమణసుధాకర్, బోయిన వెంకటనర్సయ్య, బాణోత్ మంగీలాల్, బాణోత్ రామునాయక్, జోయిన్ పాపయ్య, నరేశ్, ఆరీఫ్, చిన్న వెంకయ్య, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

‘ఆయిల్‌ఫెడ్’సొంత విద్యుత్

అశ్వారావుపేట పామాయిల్ కర్మాగారంలో విద్యుత్‌ప్లాంట్ నిర్మాణం

అశ్వారావుపేట, అక్టోబరు 10: పామాయిల్ కర్మాగారాల నిర్వహణకు అవసరమైన విద్యుత్‌ను సొంతంగా ఉత్పత్తి చేసుకోవటంలో ఆయిల్‌ఫెడ్ మరొక ముందడుగు వేసింది. గంటకు 30 టన్నుల సామర్థ్యంతో నడిచే అశ్వారావుపేట పామాయిల్ కర్మాగారం నిర్వహణకు ప్రతీ నెల రూ.25 లక్షలు.. ఏడాదికి రూ. 3 కోట్లు బిల్లులు చెల్లిస్తున్నారు. దీనిని అధిగమించేందుకు ఆయిల్‌ఫెడ్ సొంతంగా విద్యుత్ ఉత్పత్తి ప్లాంటును నిర్మించింది. విద్యుత్ భారాన్ని తగ్గించుకునేందుకు ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో 2.5 మెగావాట్ల సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి ప్లాంటును నిర్మించారు. ఈ ప్లాంటును ఆయిల్‌ఫెడ్ రూ.36 కోట్లు వెచ్చించి నిర్మాణం పూర్తిచేసింది. దీంతో కోట్ల రూపాయల విద్యుత్ బిల్లుల ఆదాతో పాటు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్‌ను పొందనున్నారు.

పామాయిల్ వ్యర్థాలతో....

సాధారణంగా విద్యుత్‌ను నీటితో, బొగ్గుతో ఉత్పత్తి చేస్తారు. కానీ అశ్వారావుపేట పామాయిల్ కర్మాగారంలో గెలల వ్యర్థాలతో విద్యుత్‌ను ఉత్పత్తి చేయనున్నారు. పామాయిల్ కర్మాగారంలో పండ్లను క్రషింగ్ చేయగా వచ్చిన ప్రెస్డ్ ఫైబర్ (గింజల నుంచి వచ్చే పామ్ పీచు వ్యర్థాలు)ను ఉపయోగించి విద్యుత్ తయారు చేస్తారు. ఈ విద్యుత్‌తో పామాయిల్ కర్మాగారం నడిచే విధంగా ప్లాంటును రూపకల్పన చేశారు. ప్రస్తుతం అశ్వారావుపేట కర్మాగారం 30 టన్నుల సామర్థ్యంతో పని చేస్తోంది. భవిష్యత్తులో 60 టన్నుల సామర్థ్యానికి చేరినప్పటికీ అవసరమైన విద్యుత్‌ను అందించేలా ప్లాంట్ నిర్మాణం చేపట్టారు. ప్లాంట్‌ను పూర్తిగా నూతన టెక్నాలజీతో నిర్మించడం విశేషం. పూర్తిగా పీచుతో నడిచే బాయిలర్ 30 టీపీహెచ్ (టన్ను పర్ అవర్) సామర్థ్యం కలిగి ఉంటుంది. ఈ బాయిలర్‌లో వ్యర్థాలను మండించి స్టీమ్ జనరేట్ చేస్తారు. అనంతరం స్టీమ్‌ను టర్బైన్‌లోకి పంపి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తారు.

ఇది రెండో ప్లాంటు..

దమ్మపేట మండలంలోని అప్పారావుపేటలో గల పామాయిల్ కర్మాగారానికి అనుబంధంగా ఇప్పటికే 4.5 మెగావాట్ల సామర్థ్యంతో స్వయం విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌ను ఆయిల్‌ఫెడ్ ఏర్పాటు చేసుకుంది. తాజాగా అశ్వారావుపేట పామాయిల్ కర్మాగారానికి విద్యుత్ ఉత్పత్తి ప్లాంటును వినియోగంలోకి తీసుకువస్తున్నారు. ఈ విద్యుత్ ప్లాంటును మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం ప్రారంభించనున్నారు. ఇందుకు ఫ్యాక్టరీస్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి పర్యవేక్షణలో అన్ని ఏర్పాటు చేసినట్లు మేనేజర్ నాగబాబు తెలిపారు.

మిత్రుడి పాడె మోసిన నామా

ఖమ్మంటౌన్, అక్టోబరు 10: నగరానికి చెందిన ప్రముఖ గ్రానైట్ వ్యాపారి బొప్పన గాంధీ ఇటీవల అమెరికాలో మృతి చెందాడు. ఖమ్మానికి చేరిన ఆయన మృతదేహానికి గురువారం కుటుంబ సభ్యు లు అంత్యక్రియలు నిర్వహించారు. గాంధీ మరణవార్త తెలుసుకున్న మాజీ ఎంపీ నామా తన సోదరుడు సీతయ్యతో కలిసి బ్యాంక్ కాలనీలోని ఆయన నివాసానికి వెళ్లారు. భౌతికకాయానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వయంగా పాడెమోసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కాగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గాంధీ మృతదేహానికి నివాళులర్పించారు.



మిత్రుడి గాంధీ అంత్యక్రియల్లో పాడె మోస్తున్న మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు

రేపటి నుంచి కోట మైసమ్మతల్లి జాతర

- మూడు లక్షలకు పైగా భక్తులు హాజరవుతారని అంచనా



కొలువుతీరిన కోటమైసమ్మతల్లి

కారేపల్లి, అక్టోబరు10: ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లిలో శనివారం 12వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మేడారం జాతర తర్వాత రాష్ట్రంలో అత్యంత జనాదారణతో జరిగే జాతర కోట మైసమ్మ తల్లి జాతర. ఈ జాతరకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలతో పాటు పరిసర జిల్లాల నుంచి మూడు లక్షలకు పైగా భక్తులు తరలివస్తారు. ఇప్పటికే ఆలయ పరిసరాల చుట్టూ రంగు రంగుల జెయింట్ వీల్స్, సైకిల్ విన్యాసాలు, వివిధ స్టాల్స్ ఏర్పాట్లు అయ్యాయి.



ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన జెయింట్ వీల్

రెండు వందల మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు

జాతర సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు రెండు వందల మంది పోలీసు సిబ్బందితో పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు కారేపల్లి రూరల్ సీఐ బి.తిరుపతిరెడ్డి, ఎస్ఐ ఎన్.రాజారాంలు తెలిపారు. ఏసీపీ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో పదిమంది ఎస్ఐలు, నలుగురు సీఐలు, 20మంది హెడ్ కానిస్టేబుళ్ల పోలీసు కానిస్టేబుళ్లు, హోంగార్డులు విధుల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

మెడిసిన్ విద్యార్థినికి ఆర్థిక సాయం

వైరా, అక్టోబరు 10: వైరా మునిసిపాలిటీ పరిధిలోని 15వ వార్డు దిద్దుపూడికి చెందిన మెడిసిన్ విద్యార్థిని పానెం శ్రీహర్షితకు వైద్యవిద్య అభ్యసించేందుకు గురువారం దాతలు ఆర్థికసాయం చేశారు. వైరా పట్టణ కాంగ్రెస్ నాయకుడు ధార్న రాజశేఖర్ ఆధ్వర్యంలో బొర్రా యూత్ సభ్యులు దాతృత్వంతో ఏర్పాటుచేసిన రూ.22,500 అలాగే అయిలూరి లక్ష్మీ జ్ఞాపకార్థం ఆమె కుమార్తె శీలం కిరణ్మయి సమకూర్చిన రూ.10వేలు మొత్తం రూ.32,500లను రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ అందజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, నాయకులు మిట్టపల్లి నాగి, అయిలూరి జగన్మోహన్‌రెడ్డి, పొదిల హరినాథ్, జాలాది రామకృష్ణ, షేక్.రహీం, నాళ్ల రమేష్, ఊరుకొండ శ్రీను, నంద్రు నాగరాజు, వీరంశెట్టి సీతరాములు, ముత్యాల కోటి, వెంకట్, శ్రీకాంత్, సాయికిరణ్, నరేష్ పాల్గొన్నారు.

పేబ్యాక్ టూ సొసైటీ ఆధ్వర్యంలో సంస్థ వ్యవస్థాపకుడైన జంగం లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో శ్రీహర్షితకు రూ.పదివేలు ఆర్థికసాయం అందజేశారు. సీఐ డి.ప్రతాప్, డాక్టర్ నవ్యకాంత్, కె.జగదీష్, రవికుమార్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి తుమ్మల

రఘునాథపాలెం/ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 10: ఇందిరమ్మ ప్రభుత్వంలో ఇంటింటికీ సంక్షేమ, అభివృద్ధి పథకాలు చేరతాయని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం రఘునాథపాలెం మండలంలో రూ.1 కోటికిపైగా అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. పలువురు మహిళలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొందని తెలిపారు. ఎత్తిపోతల పథకాలకు విద్యుత్ మరమ్మతులు ఏర్పడటంతో సాగునీటి ఎద్దడి ఏర్పడిందని రైతులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన మంత్రి తక్షణమే సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సొసైటీ చైర్మన్ రావూరి సైదబాబు, మాజీ ఎంపీటీసీ యర్రగర్ల హనుమంతరావు, మాజీ సర్పంచ్ కాపా ఆదినారాయణ, గ్రామశాఖ అధ్యక్షులు బాణోత్ కిషోర్, కిలారు వెంకటరమణ, కుతుంబాక సీతారామ్, ధరావత్ ఈరూనాయక్, మూడ్ శంకర్, పరిటాల ముత్తయ్య, ఆడంగుల సైదబాబు, శ్రీను, రమేష్ పాల్గొన్నారు.

నిర్దేశిత గడువులోగా ప్రకాశ్‌నగర్ వంతెన లోలెవల్ కాజ్ వే పనులు

ఖమ్మంలోని ప్రకాష్‌నగర్ వంతేన లోలెవల్ కాజ్ వే పనులు పూర్తి చేసి, రాకపోకలు జరిగేలా చూడాలని మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు. గురువారం ప్రకాష్‌నగర్ లోలెవల్ కాజ్ వే పనులను పరిశీలించారు. అనంతరం 16, 28 డివిజన్లలో మంత్రి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి మాట్లాడారు. మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, స్థానిక కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు సాధు రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

వీ వెంకటాయపాలెం రామాయలంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి తుమ్మల ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కుతుంబాక పుల్లయ్య కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బంగారం చోరీ

చుంచుపల్లి, అక్టోబరు10: సినీ ఫక్కీలో ఓ కారులో ఉన్న 19 తులాల బంగారు ఆభరణాలను చోరీ చేసిన సంఘటన చుంచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం పట్టణంలోని రైటర్ బస్తీ ప్రాంతానికి చెందిన సింగరేణి సంస్థలో సైంటిఫిక్ ఆఫీసర్‌గా రిటైర్డ్ అయిన వెంకటేశ్వరరావు తన భార్యతో కలిసి విద్యానగర్‌కాలనీలో ఎస్‌బీఐ బ్యాంక్ వద్దకు వచ్చారు. బ్యాంక్ లాకర్‌లో ఉన్న 19 తులాల ఆభరణాలను విడిపించుకొని బయటికి వచ్చాడు. ఆ బ్యాంక్ ముందు ఉన్న సూపర్ మార్కెట్‌లోకి కిరాణా సామాగ్రి కొనుగోలు చేసేందుకు భార్యతో పాటు వెళ్లాడు. కొనుగోలు చేసిన సామాగ్రిని ఆ షాపులో పని చేసే అతనితో తన సొంత కారు లాక్ ఓపెన్ చేసి డిక్కీలో సదురుతున్నాడు. ఈ క్రమంలో కారులోని ముందు సీటులో ఉంచిన 19 తులాల బంగారు ఆభరణాలను సినీ ఫక్కీలో ఓ యువకుడు వచ్చి కారు డోర్ తీసి తీసుకెళ్లిపోయాడు. కారులో ఇంటికి వెళ్లిన బాధితుడు బంగారు ఆభరణాలు కన్పించకపోవడంతో చుంచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రదాన రహదారిపై ఉన్న వ్యాపార సముదాయాలు, సీసీ టీవీ పూటేజ్‌లను చుంచుపల్లి ఇన్‌స్పెక్టర్ రాయల వెంకటేశ్వరరావు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, దర్యాప్తును వేగవంతం చేస్తున్నారు.

పాఠశాలలో విందు భోజనం

- మధ్యాహ్న భోజన వర్కర్లతో వంటకాలను తయారు చేయించిన ప్రధానోపాధ్యాయుడు
- క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాం.. ఎంఈవో



భోజనాలు తయారుచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సత్తుపల్లి, అక్టోబరు10: ఓ ప్రధానాపాధ్యాయుడు తన తల్లి చనిపోవడంతో చిన్నరోజు కార్యక్రమానికి విందు భోజనం తయారు చేసేందుకు తన పాఠశాలనే ఎంచుకున్నాడు. మధ్యాహ్న భోజన కార్మికులతో పాఠశాలలో చికెన్ బిర్యానీ వండించడంతో సర్వత్రా చర్చనీయాంశంగా మారిన సంఘటన గురువారం సత్తుపల్లి పట్టణంలో చోటుచేసుకుంది. పాతసెంటర్‌లోని ఎంపీపీఎస్‌లో ప్రధానోపాధ్యాయుడిగా చిత్తలూరి ప్రసాద్ పనిచేస్తున్నాడు. ఇటీవల తన తల్లి చనిపోవడంతో గురువారం చిన్నరోజు కార్యక్రమానికి నిబంధనలు మీరి ఎటువంటి అనుమతులు లేకుండా వంటశాలగా ఆ పాఠశాలను ఎంచుకున్నాడు. ఇంకాస్తా ముందుకు వెళ్లి దసరా సెలవులు అని మరిచి మధ్యాహ్న భోజన కార్మికులతో సెలవు రోజులలో 20మంది కోసం చికెన్, బిర్యానీ, ఇతర వంటకాలను వండించుకున్నాడు. ఇదేమీటని వర్కర్లను ప్రశ్నించగా, తమకు తెలియదని, హెచ్‌ఎం చెప్పడంతో భోజనాలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఇదే హెచ్‌ఎం గతంలో క్రమశిక్షణ చర్యలు కింద సస్పెండ్ కాబడిన సంగతి విధితమే.

ఇదే విషయమై ఎంఈవో నక్కా రాజేశ్వరరావును వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హెచ్‌ఎం చిత్తలూరి ప్రసాద్‌కు షోకాజు నోటీస్ అందజేశామని, విచారణ అనంతరం క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ప్రైవేట్ కార్యక్రమాలకు పాఠశాలలను వాడుకోవడం చట్టరీత్యా నేరమని, మండల కమిటీ ఆధ్వర్యంలో వర్కర్లపై విచారణ ఉంటుందన్నారు.

కిడ్నాపర్ల ముఠా అరెస్టు

- గంధసిరిలో గత నెల 25న వ్యక్తి కిడ్నాప్
- పాతకక్షలతో చేయించిన మరో వ్యక్తి
- 8 మందిని అరెస్టు చేసిన పోలీసులు

ముదిగొండ, అక్టోబరు 10: డబ్బుల కోసం కిడ్నాప్‌లకు పాల్పడుతున్న ముఠాను గురువారం ముదిగొండ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

ముదిగొండ మండలం గంధసిరి గ్రామానికి చెందిన పస్తం ఏసురాజు అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన పస్తం రామరాజు పాతకక్షల నేపథ్యంలో కిడ్నాప్ చేయించాలని అనుకున్నాడు. దీంతో పాటు అతడి దగ్గరి నుంచి డబ్బులు వసూలు చేయాలనే ఉద్దేశ్యంతో రామరాజు తనకు పరిచయం ఉన్న ఖమ్మం రూరల్ మండలం వెంటగిరికి చెందిన దగ్గుపాటి రమాదేవిని సంప్రదించి అడ్వాన్స్‌గా రూ.50వేలు ఇచ్చాడు. రమాదేవి తన అనుచరులైన కంచర్ల నాగేశ్వరరావు, దాసరి రమేష్, వసికర్ల సాయికృష్ణ, కమతం వినీత్‌లతో కలిసి ఒక ముఠాగా ఏర్పడ్డారు. పలేమెల ప్రవీణ్ అనే వ్యక్తిని కారు తీసుకొని రమ్మని చెప్పి భేరం కుదుర్చుకున్నారు. అందుకుగానూ నాగేశ్వరరావు, రమేష్‌లకు అడ్వాన్స్‌గా రూ. 50వేలు ఇచ్చాడు. వీరు ఏసురాజు కదలికలపై బంధువైన గంధం అంజయ్యను సంప్రదించారు. గతనెల 25వతేదీన రాత్రి ఏడుగంటల సమయంలో ఏసురాజు, అంజయ్య మరికొంతమందితో కలిసి గ్రామానికి వస్తున్న సమయంలో రామరాజు పథకం ప్రకారం వీరంతా కలిసి ఏసురాజును బలవంతంగా కారులోని ఎక్కించుకొని కిడ్నాప్ చేశారు. రూ.లక్ష ఇవ్వాలని బెదిరించగా, రూ.60వేలు ఫోన్‌పే ద్వారా పంపించి, మిగతా డబ్బులు రెండురోజుల్లో సర్దుబాటు చేస్తానని చెప్పడంతో ఖమ్మం బస్టాండ్ సెంటర్లో అతడిని వదిలిపెట్టారు.

మిగిలిన డబ్బుల కోసం అతడిని వారు బెదిరించగా రెండు దఫాలుగా పంపించాడు. ఈ విషయమై ఈనెల 8వతేదీన ఏసురాజు ముదిగొండ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్‌హెచ్‌వో మురళీ కేసు నమోదు చేశారు. కిడ్నాపర్ల కోసం వెతుకుతుండగా గురువారం విజయవాడ వైపు మూడుకార్లల్లో వెళుతున్నారనే సమాచారం మేరకు సువర్ణాపురం నుంచి హైవే రోడ్డు వద్ద తనిఖీ చేస్తుండగా రామరాజు, రమాదేవి, నాగేశ్వరరావు, రమేష్, సాయి కృష్ణ, వినీత్, ప్రవీణ్, అంజయ్యలు పట్టుబడ్డారు. వారి దగ్గరి నుంచి పది సెల్‌ఫోన్లు, మూడు కార్లను స్వాధీనం చేసుకొని వారిని కోర్టులో రిమాండ్ చేయడం జరిగిందని సీఐ తెలిపారు. ఇదే ముఠా గతంలో కూడా తొర్రూర్ ప్రాంతంలో కిడ్నాప్‌లకు పాల్పడినట్లు సీఐ తెలిపారు. కిడ్నాపర్ల పట్టుకున్న ఎస్‌ఐలు నరేష్, రోహిత్‌లను సీఐ మురళీ అభినందించారు.

వేతనాలు చెల్లించాలని విధుల బహిష్కరణ

వైరా, అక్టోబరు 10: మూడునెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ మిషన్ భగీరథ కాంట్రాక్టు కార్మికులు గురువారం విధులు బహిష్కరించారు. వైరా రిజర్వాయర్ మిషన్ భగీరథ వద్ద నీటి సరఫరాను నిలిపివేసి ఆందోళన చేశారు. అధికారుల నుంచి వేతనాలు చెల్లించాలని కోరినప్పటికీ స్పష్టమైన హామీ రాకపోవడంతో విధులు బహిష్కరించి ఆందోళన నిర్వహించినట్లు తెలిపారు. పదిరోజుల కిందట రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.2.60కోట్ల బిల్లులు ఎల్ఎన్‌టీ కంపెనీకి మంజూరైనప్పటికీ ఎల్ఎన్‌టీ కంపెనీ తమకు వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని కార్మికులు దుయ్యబట్టారు. మద్దెల రవి, పెంటయ్య, పాపగంటి రాంబాబు, రేపాకుల శ్రీనివాస్, వేణుబాబు, కోటాచారి, సుమన్ పాల్గొన్నారు.

గోవుల తరలింపు అడ్డగింత

● ఇరువురిపై కేసు నమోదు

పాల్వంచ, అక్టోబరు 10 : అక్రమంగా కబేళాకు గోవులను ట్రాలీలో తరలిస్తుండగా బీజేపీ నాయకులు పాల్వంచలో అడ్డుకున్నారు. గురువారం బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజరలో మోయిన్ అనే వ్యక్తి హైదరాబాదులోని కబేళాకు తరలించడానికి 22 గోవులను కొనుగోలు చేశాడు. గోవులను ఎక్కించి తరలిస్తుండగా పాల్వంచ బస్టాండ్ సెంటర్లో బీజేపీ నాయకులు భూక్యా రవి, ప్రసాద్, బట్టు శివనాయక్, క్రాంతి, సాయి తదితరులు ట్రాలీని అడ్డుకున్నారు. వారి ఫిర్యాదు మేరకు అక్కడకు చేరుకున్న పోలీసులు గోవులను సంరక్షణ నిమిత్తం నవభారత్‌లోని అన్నపూర్ణ గోశాలకు తరలించారు. గోవులను అక్రమంగా కబేళాకు తరలించడానికి ప్రయత్నించిన వ్యక్తి, ట్రాలీ డ్రైవర్‌లపై టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

తిరుమలాయపాలెం, అక్టోబరు10: మండలంలోని కాకరవాయిలో చోరీకి పాల్పడిన యువకుడిని గురువారం ఎస్ఐ జగదీష్ ఆధ్వర్యంలో పట్టుకుని కోర్టుకు రిమాండ్ చేశారు. గ్రామానికి చెందిన కొత్తపల్లి సత్యం, కొత్తపల్లి ఉపేంద్రల ఇంటిలో దారమల్ల గణేష్ చోరీకి పాల్పడ్డాడు. 15తులాల వెండి, రూ.10వేలు అపహరించాడు. నిందితుడిని పట్టుకుని విచారణ జరపగా, తానే చోరీ చేశానని ఒప్పుకోవడంతో అరెస్టు చేశారు.

నేడు గౌరిగూడెంలో విద్యుత్ కోత

సత్తుపల్లిరూరల్,అక్టోబరు10: మండలంలోని నారాయణపురం ఫీడర్, తుంబూరుఫీడర్, సదాశివునిపాలెం ఫీడర్ (ఎస్ఎస్. పాలెం, సిద్దారం, తుంబూరు ఏజీఎల్), గౌరిగూడెం సబ్ స్టేషన్ పరిధిలోని కొత్తూరు, రేజర్ల, గౌరిగూడెం, కిన్లే ఫ్యాక్టరీ ఏరియాలో శుక్రవారం విద్యుత్‌కోత ఏర్పడనున్నది. ఉదయం 8.30నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని టౌన్ ఏఈ తెలిపారు.

అన్నదాన మండపానికి భూమిపూజ



ఖమ్మంసాంస్కృతికం, అక్టోబరు10: నగరంలోని ముస్తఫానగర్ పెట్రోల్ బంక్ పక్కన నిర్మించనున్న అయ్యప్ప అన్నదాన భవనానికి గురువారం భూమిపూజ చేశారు. పాక థిల్లాన్ నారాయణ నంబూద్రి స్వామి చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. శ్రీదివ్యమణికంఠ అన్నదాన సేవాసమితి ఆధ్వర్యంలో ఖమ్మంలో ఆరేళ్లుగా అయ్యప్ప భక్తులకు అన్నదానం జరుపుతున్నామన్నారు. అయ్యప్ప దీక్ష ధరించిన భక్తులకు నిత్యం అన్నప్రసాద వితరణ కోసం ఈభవనాన్ని నిర్మించటం జరుగుతుం దన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ చిర్రారవి, గౌరవ సలహాదారు టీవీ షల్లంరాజు,సెక్రటరీ మల్లికార్జున్ పాల్గొన్నారు..

బీజేపీ వ్యతిరేక శక్తులు ఐక్యం కావాలి

ముదిగొండ, అక్టోబరు10: బీజేపీ వ్యతిరేక శక్తులు ఐక్యం కావాలని, మతోన్మాద బీజేపీకి ప్రత్యామ్నాయ శక్తిగా నిలబడే సత్తా కమ్యూనిస్టులకు ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. ముదిగొండ మచ్చా వీరయ్య భవనంలో యండ్రపల్లి రవి కుమార్ అధ్యక్షతన గురువారం జరిగిన మండల సమీక్ష సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో మూడో సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ తన మిత్రులను తృప్తిపర్చటం కోసం ఇతర రాష్ట్రాల హక్కులను హరిస్తుందన్నారు.

జ్వరంతో మహిళ మృతి

కల్లూరు, అక్టోబరు 10: మండల పరిధిలోని తాళ్లూరు గ్రామంలో ఓ మహిళ జ్వరంతో గురువారం ఉదయం మృతి చెందింది. మండల పరిధిలో గల తాళ్లూరుకు చెందిన నాయడు సత్యవతి (40) రెండు రోజులుగా జ్వరంతో ఇబ్బంది పడుతుంది. వైరాలో చికిత్స పొందుతూ మృతి చెందినది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ నాయకుడు తోటకూర శేషగిరిరావు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

భద్రయ్యకు రాయల పరామర్శ

నేలకొండపల్లి, అక్టోబరు10: కాంగ్రెస్ జిల్లా నాయకుడు నెల్లూరి భద్రయ్యను రాష్ట్రగిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ గురువారం మండ్రాజుపల్లి కొత్తూరులోని ఆయన ఇంటిలో పరామర్శించారు. ఇటీవల భద్రయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో పరామర్శించారు. బోయిన వేణు, బచ్చలికూర నాగరాజు, అంజని వారి వెంట ఉన్నారు.

ఆనందోత్సాహాలతో సద్దుల బతుకమ్మ

జిల్లావ్యాప్తంగా ఘనంగా వేడుకలు



బేతుపల్లిలో వడ్లపూడివారి వీధిలో..



ఖమ్మ సుహాస్ జ్యూయలరీ వద్ద..



సత్తుపల్లిలో బతుకమ్మల ఆడుతున్న ఎమ్మెల్యే



లింగాలలో మువ్వా విజయ్‌బాబు..



హరివిల్లు అపార్టుమెంట్‌లో..,



అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మమతరోడ్డులో..



రంగంబంజర్‌లో..



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న బొర్రా రాజశేఖర్



సద్దుల బతుకమ్మలతో మహిళలు



ముదిగొండ చెన్నకేశవస్వామి ఆలయంలో..



సారథీనగర్‌లో..

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సహకరించండి

వైరా, అక్టోబరు 10: వైరా అభివృద్ధికి తద్వారా ప్రధాన రహదారుల పక్కన దుకాణ సముదాయ నిర్మాణానికి సహకరించాలని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పిలుపునిచ్చారు.వైరాలోని ఖమ్మం రోడ్డు, మధిర-జగ్గయ్యపేట రోడ్డులో ఆర్అండ్‌బీ, నీటిపారుదలశాఖ, క్రీడాశాఖ స్థలాలను ఆక్రమించి వ్యాపారాలు చేసుకుంటున్న వారితో గురువారం తమ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. మూడు సంవత్సరాల నుంచి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టకుండా కొంతమంది రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారని అందువలన వారంతా ప్రభుత్వానికి సహకరించాలని సూచించారు. ప్రతీ ఒక్కరికి జీవనోపాధి పొందేలా అవకాశాలు కల్పిస్తామని తద్వారా ప్రభు త్వానికి కూడా ఆదాయం లభిస్తుందని వీటన్నింటి వలన అభివృద్ధి సాధించగలుగుతామని అందరూ సహకరించాలని సూచించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీవైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, టీపీసీసీ కార్యదర్శులు నూతి సత్యనారాయణ, కట్ల రంగారావు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

రతన్‌టాటా మృతి దేశానికి తీరని లోటు

మాజీఎంపీ నామా నాగేశ్వరరావు

ఖమ్మంటౌన్, అక్టోబరు10: భారత దిగ్గజ పారిశ్రామికవేత్త రతన్‌టాటా మృతి దేశానికి తీరని లోటని ఖమ్మం మాజీఎంపీ నామా నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. భారత పారిశ్రామిక రంగం ఒక దిగ్గజాన్ని కోల్పోయిందన్నారు. కేవలం వ్యాపారాభివృద్ధి మాత్రమే కాకుండా సామాజిక సేవలో ఆయన ఎప్పుడూ ముందుండేవారని కొనియాడారు.

ఖమ్మం మామిళ్లగూడెం: రతన్‌టాటా అకాల మరణం దేశానికి తీరని లోటని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేతినేని హరీష్ అన్నారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రతన్‌టాటా చిత్రపటానికి నివాళులు అర్పించారు.

కల్లూరు: మండల పరిధిలోని పోచవరంలో గురువారం సంతాప కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకుడు మాజీ జడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు రతన్ టాటా చిత్రపటానికి నివాళులర్పించారు.



కల్లూరులో నివాళులర్పిస్తున్న అజయ్‌కమార్



టీడీపీ కార్యాలయంలో..

ప్రజాసంఘాలను బలోపేతం చేయాలి: సీపీఎం

పెనుబల్లి, అక్టోబరు10: ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రజా సంఘాలను బలోపేతం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి పిలుపు నిచ్చారు. గురువారం చలమాల సూర్య నారాయణ భవన్‌లో జరిగిన ఆపార్టీ మండల కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు, మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు, కండే సత్యం, రాజినేని మంగమ్మ, గుడిమెట్ల బాబు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

మధిర, అక్టోబరు10: ఇటీవల మృతి చెందిన మధిర మండల పరిషత్ ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ మందా నాగేశ్వరరావు కుటుంబానికి రూ.72వేలను డీఆర్‌డీఏ జిల్లా అధికారి సన్యాసయ్య గురువారం అందజేశారు. ఆశాఖ ఉద్యోగులు ఈ సాయాన్ని అందించారు. గురువారం ఆయన తమ ఉద్యోగులతో కలిసి ఉద్యోగి స్వగ్రామం ఎర్రుపాలెం మండలం పెద్దగోపారం వెళ్లి నాగేశ్వరరావుకు నివాళులర్పించి అతని కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈకార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీడీ చుంచు శ్రీనివాసరావు, మధిర ఎంపీడీవో బీ వెంకటేశ్వర్లు, ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు పగిడిపల్లి మనోహర్‌రావు పాల్గొన్నారు.

రూ.2లక్షల రుణమాఫీ అమలు చేయాలి

ఖమ్మంటౌన్, అక్టోబరు10: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతీరైతుకు రూ.2లక్షల రుణమాఫీని అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో సీపీఐ ఖమ్మం రూరల్ మండల సమితి సమావేశం చెరుకుపల్లి భాస్కర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్రకంట్రోల్ కమిషన్ చైర్మన్ మహమ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు సిద్ధినేని కర్ణకుమార్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జ్వీర రామ్మూర్తి, మిడికంటి రామ్మూర్తి నాయకులు పాల్గొన్నారు.